నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. గోల్కొండ క్రాస్‌రోడ్ ఫీడర్ పరిధిలోని ఏక్‌మినార్ మసీద్, కృష్ణాకాలనీ, శివాలయం టెంపుల్, ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఉదయం 10గంటల నుంచి 11గంటల వరకు..

◆ పార్శిగుట్ట ఫీడర్ పరిధిలోని ప్రేయర్‌పవర్ చర్చ్, బాప్టిస్ట్ చర్చ్, బ్రహ్మంగారి టెంపుల్, ఈడబ్ల్యుఎస్ క్వార్టర్స్ తదితర ప్రాంతాలలో ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు..

◆ మదర్‌డైరీ ఫీడర్ పరిధిలోని రాంనగర్ క్రాస్‌రోడ్, మదర్స్ హైస్కూల్, లక్ష్మమ్మ పార్కు తదితర ప్రాంతాలలో 12గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు...

◆ రాంనగర్ ఫీడర్ పరిధిలోని పీఆర్‌టీ క్వార్టర్స్, రెడ్డి ఆయిల్ మిల్ మధ్యాహ్నం 2గంటల నుంచి 3గంటల వరకు..

◆ శాస్త్రీనగర్ ఫీడర్ పరిధిలోని మోహన్‌నగర్, రాంనగర్, జెమినీకాలనీ, సెయింట్‌పాయిస్ స్కూల్ మధ్యాహ్నం 3గంటల నుంచి 4గంటల వరకు...

◆ లేపాక్షి ఫీడర్ పరిధిలోని తపాడియా ఆస్పత్రి, గోల్కొండ సిగిరెట్ ఫ్యాక్టరీ, లేపాక్షి, ఎన్‌బీకే ఎస్టేట్ తదితర ప్రాంతాలలో సాయంత్రం 4గంటల నుంచి సాయత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఈసారైనా స్విమ్మింగ్‌పూల్ తెరిచేనా.?



ఉస్మానియాయూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని స్విమ్మింగ్‌పూల్‌ను ఐదేళ్లుగా మూసి ఉంచారు. గతేడాది ఆలస్యంగా ప్రారంభించి కేవలం 20 రోజులు కొనసాగించి మూసివేశారు. ప్రతిఏటా మార్చి మొదటి వారంలో స్విమ్మింగ్‌పూల్‌ను ప్రారంభిస్తారు. ఈ సారైన సకాలంలో ప్రారంభించాలని విద్యార్థులు కోరుతున్నారు. అయితే ప్రారంభానికి నెల రోజుల ముందు స్విమ్మింగ్‌పూల్‌ను మరమ్మతులు చేయించిన తర్వాత నీటితో నింపేందుకు 15 రోజుల పడుతుంది. కానీ ఇంత వరకు పనులు ప్రారంభించలేదని విద్యార్థులు పేర్కొన్నారు.

మధురానగర్ కాలనీ నూతన కమిటీ

సికింద్రాబాద్‌:సీతాఫల్‌మండి డివిజన్‌లోని మధురానగర్ కాలనీ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన పాలకవర్గాన్ని మూజువాణి ఓటుతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్. బ్రహ్మాచారి, ఉపాధ్యక్షులు ఈశ్వరయ్య, శ్రీధర్, ప్రధాన కార్యదర్శి రాజుసాగర్, ఉపకార్యదర్శులు ఎల్లయ్య గౌడ్, భాను ప్రసాద్, ప్రవీణ్ రెడ్డి, మహేష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైన కాలనీ నాయకులు మేకల సారంగపాణి, గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ సమయంలో కమిటీ ఎన్నిక జరిగింది.

ప్రొ.శంకర్‌కు సత్కారం

ఉస్మానియా యూనివర్సిటీ: నేషనల్ బుక్ ట్రస్ట్ (ఎన్‌బీటీ) ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 9 వరకు ప్రపంచ పుస్తక ప్రదర్శన జరిగింది. ఈ కార్యక్రమంలో 'ది రోల్ ఆఫ్ అన్ డివైడెడ్ ఆంధ్రప్రదేశ్ ఇన్ కాన్‌స్టిస్ట్యూట్ అసెంబ్లీ'అనే అంశంపై జరిగిన చర్చలో తెలుగు రాష్ట్రాలకు చెందిన వర్సిటీల అధ్యాపకులు పాల్గొన్నారు. చర్చలో అత్యంత ప్రతిభ కనబరిచిన ప్రొ.శంకర్‌ను ఎన్‌బీటీ చైర్మన్ మిలింద్ మరాఠీ శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. ప్రస్తుతం ప్రొ.శంకర్ న్యూఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లానింగ్ అండ్ మేనేజ్‌మెంట్‌లో అధ్యాపకులుగా పని చేస్తున్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు చేయూతనివ్వండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఎన్‌సీసీ విద్యార్థులకు చేయూతనివ్వాలని సికింద్రాబాద్ పీజీ కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.గంగాధర్ దాతలను కోరారు. గత నెల 26న ఢిల్లీలో రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న ముగ్గురు ఎన్‌సీసీ విద్యార్థులు గీత, రమ, శ్రీధర్‌కు ప్రిన్సిపల్ తన వంతుగా ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున రూ.15వేల చెక్కును అందజేశారు. విద్యార్థులకు దాతలు ఆర్థిక సహాయం చేస్తే ఎన్‌సీసీలో దేశానికి మరిన్ని సేవలు అందించగలరని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కమాండర్ ప్రశాంత్ సూర్య వంశీ, తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ శరత్, కల్నల్ మంజిల్ శర్మ,ఎన్‌సీసీ ఆఫీసర్ డా.మల్లారెడ్డి పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

కాచిగూడ: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ బాలిక అదృశ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మౌలానా ఆజాద్‌నగర్‌లో నివాసం ఉండే బాలిక (14) తల్లి పని నుంచి ఇంటికి వచ్చే సరికి కనిపించలేదు. వివిధ ప్రాంతాల్లో బాలిక ఆచూకీ కోసం ఎంత వెతికినా లభించలేదు. దీంతో బాలిక తల్లి కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కుసుమ హరుల కల్యాణంలో భక్తులు



కుసుమ హరులకు పూజలు చేస్తున్న అర్చకుడు



భజనలు చేస్తున్న భక్తులు

కల్యాణం.. కమనీయం

నల్లకుంట: డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌లో ఉన్న కుసుమ హరనాథ ఆశ్రమంలో ఈనెల 2న ప్రారంభమైన నామస్మరణ వారోత్సవాలు ఆదివారం ముగిసాయి. చివరి రోజున ఉదయం 5గంటల వరకు కొనసాగిన 24గంటల మౌన జపం ముగిసింది. అనంతరం ఆలయ ప్రధాన అర్చక స్వామి రాంగోపాల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు అక్కడి కల్యాణ మండపంలో పురోహితుల మంత్రోచ్చరణల నడుమ 'కుసుమ హరుల దివ్య లీలా కల్యాణం'అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి కావ్య దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశ్రమ కమిటీ సభ్యులు కేంద్ర మంత్రి దంపతులకు కుసుమహరుల చిత్రపటాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో కుసుమ హరనాథ ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు గుబ్బా నాగేందర్‌రావు, కార్యదర్శి భోగ రాములు, సంయుక్త కార్యదర్శి బొడ్ల హరనాథ్ బాబు, కోశాధికారి బొడ్ల సోమలింగం, కార్యక్రమ నిర్వాహకులు నందూరి ఇందిర, కమిటీ సభ్యులు మాధురి, శశిరేఖ, బండ సత్యనారాయణ, కేవీ రామారావు, కొండయ్య గుప్త తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ మేయర్ పీఠమే లక్ష్యంగా పనిచేయాలి

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: ఢిల్లీ ఫలితాల స్ఫూర్తితో గ్రేటర్ పరిధిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మేయర్ పీఠమే లక్ష్యంగా పనిచేయాలని రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన గుండగోని భరత్‌గౌడ్ అభినందన సభ ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... పార్టీ కోసం అంకిత భావంతో పనిచేసే ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. అందుకు నిదర్శనం భరత్‌గౌడ్ అని అన్నారు. ప్రజా సమస్యలపై నాయకులు ఉద్యమించాలని సూచించారు. అధికార పార్టీ హామీల అమలుపైన పోరాటం చేయాలన్నారు. భరత్‌గౌడ్ మాట్లాడుతూ...



మహంకాళి జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన భరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్

పార్టీ అధిష్ఠానం తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి, నాయకులు జి.కిరణ్, రాంరెడ్డి, గడ్డం నవీన్, వెంకటేష్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్‌ను ఏ,బీ,సీ,డీ వర్గీకరణతో అమలు చేయాలి



బహుజన లెఫ్ట్ పార్టీ అధ్యక్షుడు దండి వెంకట్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణనలో బీసీ కులాల జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థలకు నిర్వహించబోయే ఎన్నికల్లో 42శాతం బీసీ కులాల రిజర్వేషన్లను ఏ,బీ,సీ,డీ వర్గీకరణతో నిర్వహించాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దండి వెంకట్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులగణనలో ఎంబీసీ కులాల జనాభా లెక్కల వివరాలపై సమగ్ర వివరాలు వెల్లడించాలన్నారు. బీసీ(ఏ) జాబితాలోని 68 కులాల జనాభా సర్వే సమగ్రంగా జరగలేదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం కులగణన నిర్వహించి స్థానిక సంస్థల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. ఏ, బీ, సీ, డీ వర్గీకరణ అమలు చేయకుండా జనరల్‌గా బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తే బీసీ(ఏ) జాబితాలో ఉన్న కులాలకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన లెఫ్ట్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఎస్. సిద్ధిరాములు, వడ్లసాయి కృష్ణ, కోశాధికారి మారోజు సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫిషర్‌మెన్ రిజిస్ట్రేషన్ సొసైటీలకు అనుమతులివ్వాలి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రజకుల ఉపాధి కల్పన కోసం ఫిషర్‌మెన్ రిజిస్ట్రేషన్ సొసైటీలకు అనుమతులు ఇవ్వాలని రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల కమిటీ వ్యవస్థాపక చైర్మన్ ఆమనగంటి సైదులు డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సొసైటీల రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమనగంటి సైదులు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రజకులకు ఉపాధి కల్పించేందుకు జీవో నం.343 ప్రకారం గ్రామ సొసైటీలకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించి రజకుల అభివృద్ధికి తగిన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో రజకులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రజకులకు ఆర్థిక బరోసా కల్పించే విధంగా ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. ఈ విషయంపై త్వరలో ఫిషర్‌మెన్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు



రజక ఫిషర్‌మెన్ రాష్ట్ర సొసైటీల సమావేశంలో మాట్లాడుతున్న ఆమనగంటి సైదులు

సాయికుమార్, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దూదిగాని చంద్రశేఖర్, చాకలి రామస్వామి, రమేష్, నర్సింహులు, నరేష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న సంగీత కచేరి

నల్లకుంట: న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ పరిసరాలు శ్రీరామనామ స్మరణతో మార్మోగింది. అఖిల భారత శ్రీరామ కోటిలేఖన మహా సంఘం వార్షికోత్సవాల్లో ఆదివారం సుందరకాండ, విష్ణు సహస్రనామ పారాయణ జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం భక్తి సంగీత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రముఖ సంగీత విద్వాంసురాలు శ్రీదేవి బృందం గానం చేసిన భక్తి గీతాలు అలరించాయి. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ జరిగింది. మహాసంఘం వార్షికోత్సవాలు మంగళవారంతో ముగుస్తాయని సంఘం అధ్యక్షుడు ఆర్ఎస్.రంగదాసు, కార్యదర్శి కేవీ.తిరుమల రావు తెలిపారు.

శయన దృశ్య నాటకం.. ప్రేక్షక రంజకం

చిక్కడపల్లి: నృత్యం, నాటకం రెండు కళా ప్రక్రియలు తెలుగు వారికి మరచిపోలేని అనుభూతిని కల్గిస్తాయని ప్రముఖ రచయిత, బాలభవన్ పూర్వ డైరెక్టర్ రసమయి రాము అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో విశ్రాంత ఐఏఎస్ కేవీ రమణాచారి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం రాత్రి వల్లూరి శ్రీహరిరావు, భాస్కరరావుల బృందం శ్రీకృష్ణరాయభారంలోని శయన దృశ్యం నాటకాన్ని కళాకారులు ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. తెలుగు భాషా సంపద రాయభార పద్యాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనామూర్తి, ప్రముఖులు ఎపీ మైన్స్ పూర్వ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, తులసి తదితరులు పాల్గొన్నారు.



నాటక కళాకారులతో రసమయి రాము, జనార్దనామూర్తి, వీడీ రాజగోపాల్

23 నుంచి హనుమత్ వైభవ ఉత్సవాలు

వెంగళరావునగర్ : మధురానగర్‌కాలనీలోని అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఈనెల 23 నుంచి మాఘమాస హనుమత్ వైభవ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ వ్యవస్థాపక ధర్మకర్తలు తోటకూర నరసింహారావు, వెంకటరమణ తెలిపారు. దేవస్థానంలో ఆదివారం వారు మాట్లాడుతూ.. 23న ఉదయం 7 గంటల నుంచి పూజలు ప్రారంభమవుతాయన్నారు. 24న ఉదయం 7 నుంచి 24 గంటల పాటు అఖండ హనుమాన్ చాలీసా పారాయణం, 25న ఉదయం 7.30 గంటలకు విశేష పంచామృతాభిషేకం ఉంటుందని తెలిపారు. అదేరోజు ఉదయం 9 నుంచి లక్ష అరటిపండ్లతో ప్రత్యేక అర్చన రాష్ట్రంలోనే తొలిసారిగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదానం, సాయంత్రం 6.30 తిరువీధి ఉత్సవం జరుగుతుందని తెలిపారు.

డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కాచిగూడ: రాష్ట్రంలో అసంఘటిత కార్మికులుగా ఉన్న డ్రైవర్లకు తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలంగాణ సెక్యూర్ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరగోని రాజుగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్ లైసెన్స్‌పై ఉన్న ప్రమాద బీమా రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని అలాగే సాధారణ మరణం పొందితే కూడా వర్తింపజేయాలన్నారు. అర్హులైన ప్రతి డ్రైవర్‌కు సబ్సిడీ వాహనాలు అందించాలని, పెంచిన గ్రీన్ ట్యాక్స్, క్వార్టర్ ట్యాక్స్‌లను తగ్గించాలని, ఓలా, రాపిడో, ఉబెర్‌ను నిషేధించి ప్రభుత్వమే రవాణా యాప్‌ను రూపొందించాలన్నారు. అనంతరం తెలంగాణ సెక్యూర్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా కొంతం మహేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా బి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పాడుగు శ్రీకాంత్, సంయుక్త కార్యదర్శులుగా జి.అనిల్, డి.పవన్, కోశాధికారిగా జె.కుమార్, సలహాదారులుగా వంగ కృష్ణకర్ గౌడ్, కార్యవర్గ సభ్యులుగా నరసింహ, పి.మహేందర్, సీహెచ్ రమేశ్, ఎస్ఎం మహేశ్, వై.వీరన్నను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

స్పౌజ్ బదిలీలను చేపట్టాలి

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వ తరహాలోనే కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పౌజ్ బదిలీలు చేపట్టాలని తెలంగాణ సెంట్రల్ స్పౌజ్ ఫోరం విజ్ఞప్తి చేసింది. ఈమేరకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఫోరం ప్రతినిధులు కుమారస్వామి, నాందేవ్ జాదవ్, శైలజ తదితరులు మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో 317 వల్ల ఉద్యోగులు స్థానికతను కోల్పోయారన్నారు. ఆ జీవో కారణంగా నష్టపోయిన స్పౌజ్ ఉద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రివర్గం సబ్ కమిటీ తీసుకువచ్చిన జీవో 243తో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు స్పౌజ్ బదిలీలు చేపట్టారన్నారు. కానీ భార్యాభర్తల్లో ఒకరు రాష్ట్ర ప్రభుత్వం, మరొకరు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని పరిగణలోకి తీసుకోలేదన్నారు. దీంతో తమ పిల్లలకు దూరమై తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తాము తెలంగాణ ప్రాంతానికి చెందిన ఉద్యోగులమే అని, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న వారందరిని సొంత జిల్లాలకు బదిలీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

కారుతో డ్రైవర్ పరార్

బంజారాహిల్స్: అద్దెకు కార్లు ఇచ్చే వ్యాపారి వద్ద నమ్మకంగా పనిచేస్తూ కళ్లుగప్పి కారుతో ఉడాయించిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డునంబర్-3లో నివసించే అనీష్ ఊబర్ క్యాబ్‌లు నిర్వహిస్తుంటాడు. ఆయన వద్ద కొంతకాలంగా నాగారపు వెంకటేష్ డ్రైవర్‌గా చేరి అద్దె కార్లు తిప్పుతుండేవాడు. ఈనెల 2న తాను ఉద్యోగం మానేస్తున్నానని చెప్పి కారుతో సహా ఉడాయించాడు. కారు జీపీఎస్ ట్రాక్‌ను పరిశీలించగా ఏపీలోని ఏలూరు జిల్లా ఒంగుటూరు టోల్‌ప్లాజా వద్ద గుర్తించారు. కారుతో సహా ఉడాయించడమే కాకుండా పేమెంట్ కూడా చెల్లించలేదని, చర్యలు తీసుకోవాలంటూ బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది'



ఆలయ కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డు లక్ష్మీగణపతి దేవాలయం పునరుద్ధరణ కమిటీ ప్రమాణస్వీకారోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్ కుమార్‌యాదవ్‌తో పాటు బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, కాంగ్రెస్ నాయకుడు అరవింద్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ హాజరై నూతనంగా ఎన్నికైన కమిటీని అభినందించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేవాలయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కమిటీ చైర్మన్ మారిశెట్టి నరసింగరావు, ఈవో లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. లక్ష్మీగణపతి దేవాలయం అభివృద్ధికి తామంతా కలసికట్టుగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు జిల్లా శివకుమార్, మీసాల రాజేష్, డి.భానుచందర్, గడప భాగ్యలక్ష్మి, సాయికీర్తి, గిరిబాబు, గుర్రం దినేష్, బద్రి నవీన్‌కుమార్, పి.సురేష్‌యాదవ్, గుండ్ల గజానంద్, ఎం.గణి, జి.లలిత, రామకృష్ణ, జి.శ్రీనివాస్, కె.శివకుమార్, చంద్రగిరి, శ్రీనివాస్‌గౌడ్ తదితరులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శీలం సత్యనారాయణ, యాదగిరిగౌడ్, జయేంద్రబాబు, సంజీవ రెడ్డి, నర్సింగ్‌ముదిరాజ్, సురేష్, గుర్రం శంకర్, గుండు జగదీష్‌బాబు, అభిషేక్ కెనడీ, నరేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

యూజీసీ ముసాయిదాను వెనక్కి తీసుకోవాలి



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చీమ శ్రీనివాస్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యూజీసీ ముసాయిదాను వెంటనే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రొ. గాలివినోద్ కుమార్ డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయాలలో గవర్నర్‌కి ప్రాధాన్యం ఇవ్వడం ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. విశ్వవిద్యాలయాలలో రాజకీయ జోక్యం ఉండకూడదని వారు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం విద్యా విభాగం ఆధ్వర్యంలో యూజీసీ ముసాయిదాకు వ్యతిరేకంగా ఉద్యమిస్తుందని హెచ్చరించారు. విద్యార్థులు, అధ్యాపకులు ప్రజాస్వామికవాదులు ఈ ముసాయిదాకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో సాధారణ పౌరులకు సైతం అందుబాటులో ఉండే విధంగా ఉచిత విద్యా, వైద్యం ఉండాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ గుండు దయానంద్, కొండా స్వామి, అనిల్ కుమార్, ఆర్‌కె భూపాల్, జానకీ రెడ్డి, శ్యామల, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ఫలితాలు అసమర్థ ఆప్ పాలనకు గుణపాఠం



గాంధీనగర్ ఆంధ్రాకేఫ్ చౌరస్తాలో బాణసంచా కాలుస్తున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అవినీతి, అసమర్థ ఆప్ పాలనకు తగిన గుణపాఠం లాంటిదని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ భారీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ శ్రేణులు ఆదివారం ఆంధ్రాకేఫ్ చౌరస్తాలో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. అందులో భాగంగానే మధ్య తరగతి ప్రజలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో రూ.12 లక్షల వరకు పన్ను విధించకపోవడం హర్షణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు వినయ్‌కుమార్, రత్నసాయిచంద్, నవీన్‌కుమార్, వీఎస్టీ రాజు, శ్రీకాంత్, ఉమేష్, మహమూద్, సత్తిరెడ్డి, ప్రకాష్‌యాదవ్, పాలశ్రీనివాస్, మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శివకుమార్ యాదవ్ సేవలు చిరస్మరణీయం

కాచిగూడ: జాతీయ కబడ్డీ క్రీడాకారుడు శివకుమార్ యాదవ్ అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం చెప్పల్‌బజార్‌లో జరిగిన శివకుమార్ యాదవ్ సంస్మరణ సభలో ఆయన చిత్రపటానికి కిషన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, కాలేరు వెంకటేష్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, బీజేపీ నేతలు సి.నందకిషోర్ యాదవ్, సి.వినోద్ యాదవ్, ఎక్కాల నందు, ఎక్కాల కన్నా, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, తదితరులు హాజరై అంజలి ఘటించారు.



శివకుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

కాచిగూడ: విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పీఈటీలపై ఉందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణ సంక్షేమ గురుకుల స్కూల్స్ వ్యాయామ విద్యా ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి పీఈటీల కృతజ్ఞత సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1600 పోస్టుల వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీలం వెంకటేశ్, గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శి ఎం.పర్వతాలు గౌడ్ సైదులు, వేముల రామకృష్ణ, జిల్లాపెల్లి అంజి తదితరులు పాల్గొన్నారు.